క్లుప్తంగా

ట్రిపుల్ఆర్ సెంటర్ ప్రారంభం



వించిపేట(విజయవాడ పశ్చిమ): ట్రిపుల్ ఆర్ సెంటర్‌ను 49వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్ సచివాలయం ప్రాంగణంలో శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పాత వస్తువులు, దుస్తులు, వేరొకరి అవసరాలకు ఉపయోగపడేలా రూపొందించిన ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అప్సర థియేటర్‌లో సీట్లు దగ్ధం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఫ్యాన్స్ అత్యుత్సాహంతో థియేటర్‌లో సీట్లు దగ్ధమయ్యాయి. సినీ హీరో జూనియర్ ఎన్టీఆర్ పుట్టిన రోజు సందర్భంగా విజయవాడ అప్సర థియేటర్‌లో సింహాద్రి సినిమా ప్రదర్శించారు. ఫ్యాన్స్ క్రాకర్స్ కాల్చడంతో నిప్పు రవ్వలు పడి సీట్లు దగ్ధమయ్యాయి. ఆ సమయంలో థియేటర్‌లో గందరగోళం నెలకొంది. థియేటర్‌లో మంటలు వ్యాప్తి చెందాయన్న సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది అప్రమత్తమయ్యారు. మంటలను ఆర్పివేశారు. అప్సరా సినిమా హాల్లో మిగిలిన షోలు ప్రదర్శించకుండా నిలిపివేశారు.

దాతల సహకారం మరువలేనిది



మధురానగర్(విజయవాడసెంట్రల్): దాతల సహకారం మరువలేనిదని డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు వసంత కుమార్ తెలిపారు. దుర్గాపురానికి చెందిన డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న సేవాకార్యక్రమాలకు సహకరిస్తున్న దాతలకు శనివారం సాయంత్రం సత్కారం జరిగింది. వసంతకుమార్ మాట్లాడుతూ వాంబేకాలనీకు చెందిన మాతృదేవోభవ వృద్ధాశ్రమానికి రూ. 35వేల వ్యయంతో షెడ్డును నిర్మించి అన్నదానానికి సహకరించిన దాతలను సత్కరించుకోవటం ఆనందంగా ఉందన్నారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గురునాయుడు మాట్లాడుతూ సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న ట్రస్ట్ సభ్యులను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. అనంతరం ట్రస్ట్ సభ్యులు, దాతలను సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి కె.రాము, ఉపాధ్యక్షులు కె. వరప్రసాద్, కోశాధికారి ఏడుకొండలు, బీసీ సంక్షేమ సంఘం నాయకుల వీరంకి గోకర్ణేశ్వరరావు, మండ రాము, ఫణి మిత్ర బృందం తదితరులు పాల్గొన్నారు.

బాలికను వేధిస్తున్న యువకుడిపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సండే స్కూల్‌కు వెళుతున్న 13 ఏళ్ల మైనర్ బాలికను వేధిస్తున్న యువకుడిపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గొల్లపూడి మైలురాయి సెంటర్‌లో కట్టివరపు ప్రకాష్ తెలుగు బాప్టిస్ట్‌లో పాస్టర్. అతని బావమరిది ముత్యాల వంశీ అలియాస్ కౌషితో సండే స్కూల్ నిర్వహిస్తున్నారు. మైలురాయి సెంటర్‌కు చెందిన మైనర్ బాలిక పాఠశాలకు సెలవులు కావడంతో సండే స్కూల్‌కు పాటలు నేర్చుకునేందుకు వెళుతోంది. పాటలు చెప్పే కౌషి బాలికను వేధిస్తున్నాడు. ఈ విషయం ఇంట్లో చెబితే చంపేస్తానని బాలికను బెదిరించాడు. కౌషి తనను వేధిస్తున్నాడని ఈనెల 15న బాలిక తల్లిదండ్రులకు చెప్పింది. బాలిక తల్లిదండ్రులు పాస్టర్ ప్రకాష్, అతని బంధువులకు జరిగిన విషయం తెలిపారు. వారి నుంచి స్పందన రాలేదని బాలిక తల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మరో ఘటనలో..

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రేమ పేరుతో మైనర్ బాలిక వెంట పడి వేధిస్తున్న యువకుడిపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. విద్యాధరపురం కామకోటి నగర్‌కు చెందిన బాలిక నగరంలోని మహిళా కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదివి మానేసింది. ఇంటర్ చదివే రోజుల్లో తన జూనియర్‌ద్వారా ఉదయ్ అనే యువకుడు పరిచయం అయ్యాడు. అప్పటి నుంచి మైనర్ బాలికను ప్రేమిస్తున్నానని వెంటపడుతున్నాడు. తన వెంట పడవద్దని బాలిక చెప్పినా అతను వినిపించుకోలేదు. దీంతో బాలిక తల్లిదండ్రులకు విషయం చెప్పింది. బాలిక భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా అతనిపై కేసు నమోదు చేశారు.

రూ.1.70 కోట్లతో వాటర్‌ట్యాంక్

46వ డివిజన్‌లో చురుగ్గా అభివృద్ధి పనులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): స్థానిక 46వ డివిజన్‌లో రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు చెప్పారు. డివిజన్‌లోని కొండ ప్రాంతాల్లో మంచి నీటి సమస్య పరిష్కారానికి రూ. 1.70 కోట్ల వ్యయ అంచనాతో వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. 46వ డివిజన్ పరిధిలోని కేఎల్‌రావునగర్ వీఎంసీ కాలనీ, రాజీవ్‌శర్మనగర్, కేఎల్‌రావునగర్ అవుట్‌ఫాల్ డ్రైన్, కేటీ రోడ్డు ప్రాంతాల్లో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, పార్టీ నాయకులు, అధికారులు శనివారం పర్యటించారు. డివిజన్ పర్యటనలో స్థానిక మహిళలతో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడారు. ఈ ప్రాంతంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కేఎల్‌రావు పార్కును సందర్శించి పనుల పురోగతిపై ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వాకింగ్ ట్రాక్, ఇండోర్ స్టేడియాన్ని పరిశీలించారు. అనంతరం రాజీవ్‌శర్మనగర్‌లోని సచివాలయం వద్ద నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన ట్రిపుల్ ఆర్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో కొన్ని ఇప్పటికే పూర్తవ్వగా, మరి కొన్ని జరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా కేఎల్‌రావు పార్కు అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించడమే కాకుండా పార్కును ఆహ్లాదకరంగా మార్చే పనులు చేస్తున్నారని తెలిపారు. గతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిగణలోకి తీసుకుని పనులు చేస్తున్నామన్నారు. 46ను మోడల్ డివిజన్‌గా మారుస్తున్నామన్నారు.



డివిజన్ పర్యటనలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ భాగ్యలక్ష్మి



ట్రిపుల్ఆర్ సెంటర్‌లో ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి

ట్రిపుల్ఆర్ సెంటర్ ప్రారంభం

డివిజన్‌లోని సచివాలయం వద్ద వీఎంసీ ఏర్పాటు చేసిన ట్రిపుల్ఆర్ కౌంటర్‌ను ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ భాగ్యలక్ష్మి ప్రారంభించారు.

స్వచ్ఛత– పరిశుభ్రతలో నగరానికి మూడో ర్యాంక్ వచ్చిందని, దీన్ని మరింత మెరుగు పడేలా సచివాలయం, కార్పొరేషన్ సిబ్బందితో పాటు వలంటర్లు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు తమ వద్ద ఉన్న పనికి రాని సామగ్రి, దుస్తులు, ఎలక్ట్రికల్ వస్తువులను ఈ కేంద్రాల్లో అందిస్తే వాటిని ఉపయోగించి కొత్త ఉత్పత్తులను రూపొందిస్తారన్నారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ తనకు పలు కార్యక్రమాల్లో ఇచ్చిన శాలువాలను ఈ ఆర్ కేంద్రంలో అందిస్తున్నానని చెప్పారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు వెన్నం రజనీ కుమార్, రాయన నరేంద్ర, దేవత్ మురళీనాయక్, ఆదిల్, మజ్జి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ కాలనీలో వాటర్ ట్యాంక్‌లకు మరమ్మతులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రూరల్ మండలం జక్కంపూడి వైఎస్సార్ కాలనీ గొల్లపూడి 10వ సెగ్మెంట్ పరిధిలోని పలు బ్లాకులలో పగిలిపోయి పెద్ద ఎత్తున లీకవుతున్న సింటెక్స్ వాటర్ ట్యాంక్‌లకు మరమ్మతులు ప్రారంభించడంపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పదో సెగ్మెంట్ పరిధిలో 207, 219, 227 బ్లాకులపై ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్‌లు పగిలాయి. దీంతో తాగునీటికి ప్రజలు పడుతున్న ఇబ్బందులను మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లామని స్థానిక ఎంపీటీసీ షేక్ సైదాబీ, ఆమె భర్త హిమవలి తెలిపారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ తన సొంత ఖర్చులతో ఆయా వాటర్ ట్యాంక్‌లకు శనివారం మరమ్మతులు చేయిస్తున్నారని వారు వివరించారు. వాటర్ ట్యాంక్‌లకు మరమ్మతులు చేయించి వేసవి కాలంలో తాగునీటి కొరత లేకుండా చర్యలు చేపట్టిన ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

నగరంలో విస్తృతంగా ఫుట్ పెట్రోలింగ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీస్ అధికారులు వారి సిబ్బందితో కలిసి శనివారం సాయంత్రం ఫుట్ పెట్రోలింగ్, విజిబుల్ పోలీసింగ్, వాహన తనిఖీలు చేశారు. ఇందులో భాగంగా కొంత మందిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. వాహన తనిఖీలో సరైన రికార్డులు లేని వారిని, రిపీటెడ్ చలానాలు ఉన్న వాహనాలను గుర్తించి చలాన్లు విధించారు. శుక్రవారం రాత్రి నగరంలోని వివిధ ఖాళీ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న, న్యూసెన్స్ చేస్తున్న 55 మందిపై, మోటార్ వాహన చట్టం ఉల్లంఘించిన వారిపై 1063 కేసులు నమోదు చేశారు.

యువతి అదృశ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): యువతి అదృశ్యమైన ఘటనపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు భవానీపురం రైతు బజారు ప్రాంతానికి చెందిన యువతి పదో తరగతి వరకు చదివింది. చిన్నప్పటి నుంచి అమ్మమ్మ వాళ్ల ఇంటి వద్ద ఉంటోంది. కొద్ది రోజులుగా ఓ యువకుడితో ఫోన్‌లో మాట్లాడుతోంది. విషయం ఇంట్లో తల్లిదండ్రులకు తెలిసి ఫోన్‌లో ఎవరితో మాట్లాడుతున్నావని మందలించారు. ఈ క్రమంలో శనివారం ఉదయం నుంచి ఆ యువతి కనిపించడం లేదు. చుట్టుపక్కల వెదికినా ఫలితం లేదు. ఆ యువతి ఫోన్‌లో మాట్లాడే వ్యక్తితో వెళ్లి ఉంటుందని ఆమె తల్లి ఓబులమ్మ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూన్ 24, 25 తేదీల్లో కథా వర్క్‌షాప్

విజయవాడ కల్చరల్: సమన్విత సాంస్కృతిక సేవా సంస్థ, సేఫ్, కామ్రేడ్ పోలవరపు కోటేశ్వరరావు సాహితీపీఠం ఆధ్వర్యంలో జూన్ 24, 25 తేదీల్లో కృష్ణా జిల్లా చినముక్తేవిలో కథా వర్క్‌షాప్ నిర్వహిస్తునట్లు సమన్విత సేవా సంస్థబాధ్యులు శాంతిశ్రీ, శమంతకమణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2017 లో సమన్విత సంస్థను ప్రారంభించామని నాటి నుంచి ఏటా సాహిత్య సమావేశాలు, శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఏడాది కథా రచయిత మహ్మద్ ఖదీర్ బాబు ఆధ్వర్యంలో కథా వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని వయో బేధం లేకుండా శిబిరంలో ఎవరైనా పాల్గొనవచ్చని వివరించారు. వివరాలకు శాంతిశ్రీ 833 381 8985, శమంతకమణి 94919 62648 ,ఉషారాణి 94928 79210 నంబర్లలో జూన్ 10వ తేదీ వరకు పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

సిరివెన్నెలకు స్వరాంజలి

విజయవాడ కల్చరల్: సినీ గేయ రచయిత, కవి సిరివెన్నెల సీతారామశాస్త్రి జయంతి సందర్భంగా మోహన్ కృష్ణా ఆర్ట్స్ ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం సిరివెన్నెలకు అమర గాయకులకు స్వరాంజలి, తెలుగు సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. ఆ సంస్థ కార్యదర్శి బి.ఆశయ్య సిరివెన్నెల సీతారామ శాస్త్రి సినీరంగ సేవలను వివరించారు. సినీ సాహిత్యంలో సిరివెన్నెలు కురిపించిన రచయిత సీతారామ శాస్త్రి అని తెలిపారు. తెలుగు సినిమాలకు జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చిన కవి సిరివెన్నెలగా అభివర్ణించారు. మోహన్ కృష్ణా ఆర్ట్స్ అధ్యక్షురాలు బి.లక్ష్మీబాయి, కోశాధికారి మోహన్ కృష్ణానాయక్, తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు పాల్గొన్నారు. ఆశయ్య ఆధ్వర్యంలో కృష్ణకుమారి, సువర్ణలక్ష్మి, శివనాగలక్ష్మి రూపశ్రీ, కృష్ణ సింధూ, రైల్వే శ్రీనివాస్. షేక్ రసూల్‌బాబు. రామశంకరావు పలు చిత్ర గీతాలను ఆలపించారు.



సిరివెన్నెల సినీ జీవిత విశేషాలు వివరిస్తున్న ఆశయ్య, రసూల్ బాబు తదితరులు

గుడ్ షపర్డ్ సంస్థ, ఆర్ఆర్ ఫౌండేషన్ పేరుతో మోసం

ఎన్‌సీబీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జాన్‌మాస్క్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో గుడ్ షపర్డ్ సంస్థ, ఆర్ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన క్రైస్తవ మత బోధకులు, పాస్టర్లను మోసం చేశారని నేషనల్ క్రిస్టియన్ బోర్డు జాతీయ అధ్యక్షులు డాక్టర్ జాన్‌మాస్క్ ఆరోపించారు. సింగ్‌నగర్‌లోని ఆ సంస్థ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో శనివారం ఆయన మాట్లాడుతూ పాస్టర్లు కొంతమొత్తం డబ్బులు పెట్టుబడి పెడితే భారీ మొత్తంలో ఇస్తామని చెప్పి కేవలం పాస్టర్లను మాత్రమే టార్గెట్ చేసి భారీ మోసానికి ఆ సంస్థల నిర్వాహకులు పాల్పడ్డారని ఆరోపించారు. తమ వద్ద డిపాజిట్ చేస్తే తమిళనాడులో ఒక్కొక్కరికి ఐదు సెంట్ల స్థలం ఇస్తామని ఆశచూపి కొంత మంది నుంచి ఐదు లక్షల రూపాయలు కూడా వసూలు చేశారని, మరికొంత మందికి డ్వాక్రా మహిళా సంఘాలకు కోటి రూపాయల వరకూ రుణాలు ఇస్తామని చెప్పి మోసం చేసినట్లు వివరించారు. నిరుపేద పాస్టర్లు, క్రైస్తవ పెద్దలను మోసం చేసిన సదరు సంస్థల నిర్వాహకులపై డీజీపీ చర్యలు తీసుకోవాలని కోరారు. పలు సంఘాల పాస్టర్లు, క్రైస్తవ మత పెద్దలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ విజేత కృష్ణా జట్టు



కృష్ణా జిల్లా బాలుర జట్టుకు కప్ అందజేస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: ఉల్లంపర్రు మాంటిస్సోరీలో నాలుగు రోజులుగా నిర్వహించిన కవురు శ్రీనివాస్ కప్ రాష్ట్ర స్థాయి బాలుర, బాలికల బాస్కెట్‌బాల్ పోటీలు ఉత్కంఠగా సాగాయి. ఫైనల్‌లో తూర్పుగోదావరి జిల్లా బాలికల జట్టు కృష్ణా జిల్లా బాలికల జట్టుపై 55/43 పాయింట్ల తేడాతో విజయం సాధించి విజేతగా నిలిచింది. కృష్ణా జిల్లా బాలుర జట్టు తూర్పుగోదావరి జట్టుపై 62/40 పాయింట్ల తేడాతో విజయం సాధించి కవురు శ్రీనివాస్ కప్ ట్రోఫీని గెలుచుకున్నారు. కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.చెంగల్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి జి.చక్రవర్తి, కోశాధికారి బి.రేవతి, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేను స్టూడెంట్ సర్ చిత్ర యూనిట్ సందడి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): 'నేను స్టూడెంట్ సర్' చిత్ర యూనిట్ నగరంలో సందడి చేసింది. ఒక యువకుడు తన సెల్ ఫోన్ పోగొట్టుకున్న నేపథ్యంలో ఎదురయ్యే పరిణామాలను ఈ చిత్రంలో దర్శకుడు చాలా చక్కగా చిత్రీకరించారని హీరో బెల్లంకొండ గణేష్ తెలిపారు. జూన్ 2న ఈ చిత్రం రిలీజ్ కానుందని ఆయన పేర్కొన్నారు. గాంధీనగర్‌లోని సదరన్ హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో హీరో బెల్లంకొండ గణేష్ మాట్లాడుతూ 'నేను స్టూడెంట్ సర్' చిత్ర ప్రమోషన్ కార్యక్రమాన్ని విజయవాడ నగరం నుంచి ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తనకు హీరోలు వెంకటేష్ జూనియర్ ఎన్టీఆర్ అంటే ఎంతో ఇష్టమని వారి చిత్రాలను ఎన్నో చూశానని, వారిని ఆదర్శంగా తీసుకొని సినిమా ఇండస్ట్రీకి వచ్చినట్లు పేర్కొన్నారు. దర్శకుడు రాఖీ ఉప్పలపాటి లో నిర్మాత నాంది సతీష్ , జబర్దస్త్ రాంప్రసాద్, కమెడీయన్ రవితేజ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హీరో బెల్లంకొండ గణేష్

వైజ్ఞానిక స్పృహతో సామాజిక అవగాహన

కృష్ణలంక(విజయవాడతూర్పు): వైజ్ఞానిక స్పృహ ఉన్నవారే సామాజిక అవగాహనతో సాగుతారని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ దేవరాజు మహారాజు అన్నారు. మానవాళి ప్రయోజనాల కోసం సాగించే పరిశోధనలు విస్తృతం కావాలన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో శనివారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేంద్రం ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎంపీ పి.మధు అధ్యక్షతన నిత్య జీవితంలో వైజ్ఞానిక స్పృహ అనే అంశంపై సభ నిర్వహించారు. దేవరాజు మాట్లాడుతూ శాస్త్రీయ పరిశోధనలకు వర్తమానంలో ప్రాధాన్యం దక్కడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ల సాయంతో ఉన్నత విద్యా సంస్థలు నడుపుకోవాలని కేంద్ర ప్రభుత్వం చెప్పడం విచారకరమన్నారు. అమరావతి బాలోత్సవ కమిటీ అధ్యక్షుడు ఎస్.పి.రామరాజు, ఎం.బి.విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పి.మురళీకృష్ణ, ఇన్‌చార్జి బి.ఆర్.తులసీరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దేవరాజు మహారాజు

సర్వమంగళ స్వరూపుడు హనుమంతుడు



సంగీత కళాశాలలో సాంస్కృతిక ప్రదర్శన



హాజరైన ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెల్లంపల్లి శ్రీనివాస్

విజయవాడ కల్చరల్: సర్వమంగళ స్వరూపుడు హనుమంతుడని ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావు అన్నారు. మల్లాది వెంకట సుబ్బారావు సుందరమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని సంగీత కళాశాలలో రెండురోజులపాటు నిర్వహించే హనుమత్ వైభవం అంశం ఆధ్యాత్మిక కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ సర్వకాల సర్వావస్థలో హనుమంతుడు రామనామం జపించడమే విజయ కారణమని నమ్మి మహిమ తెలుసుకున్నాడని తెలిపారు. హనుమంతుడిని పూజిస్తే రాముని పూజించినట్లేనని తెలిపారు. సర్వదేవతల శక్తులు హనుమంతునిలో ధారపోయాలని చతుర్ముఖ బ్రహ్మ అనుకున్నాడని వివరించారు. ధర్మానికి వ్యతిరేకంగా ఉండేవారిని హనుమంతుడు శిక్షిస్తాడన్నారు. హనుమ చెంతకు ఏ ఆయుధం చేరదని ఏ శక్తి అడ్డుకోలేదని తెలిపారు. ప్రజలు ఆధ్యాత్మికమైన మార్గం అనుసరించాలని సూచించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న నిర్వాహకుల కృషిని అభినందించారు. ప్రసంగం ప్రారంభంలో వేదపండితులు చాగంటి కోటేశ్వరరావును పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ట్రస్ట్ చైర్మన్ మల్లాది విష్ణుమాట్లాడుతూ ఏటా వైశాఖ మాసంలో ట్రస్ట్ ద్వారా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని గతేడాది చాగంటితో దేవీవైభవం ప్రసంగం ఏర్పాటు చేశామని ముక్కోటి దేవతలు ఆరాధించేంది హనుమంతుడినే అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేవెల్లంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్ అవుతు శైలజ రెడ్డి, దుర్గామలేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కర్నాటి రాంబాబు, స్థానిక కార్పొరేటర్లు కొండాయిగుంట మల్లీశ్వరి, శర్వాణీమూర్తితో పాటు వైఎస్ఆర్‌సీపీ నాయకులు పలువురు పాల్గొన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలో భాగంగా భాగవతుల వెంకట్రామ శర్మ బృందం పలు సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించింది. నిర్వాహకులు చాగంటి కోటేశ్వరరావును ఘనంగా సత్కరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



హనుమత్ వైభవంపై చాగంటి ప్రవచనాలు

పర్యావరణాన్ని కాపాడాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పర్యావరణ పరిరక్షణలో భాగంగా మేరీ లైఫ్ మేరా స్వచ్ఛ షహర్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్ రీసైకిల్ రియూజ్) వాహనాసం ద్వారా సేకరించిన వ్యర్థాలను పునర్వినియోగంలోకి తీసుకురానున్నట్లు కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. ప్రపంచ పర్యావరణాన్ని పురస్కరించుకుని మేరీ లైఫ్ మేరా స్వచ్ఛ షహర్ కార్యక్రమంలో వీఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్ రీసైకిల్ రీయూజ్) వాహనాన్ని కలెక్టర్ ఎస్. ఢిల్లీ రావు శనివారం ఆయన క్యాంపు కార్యాలయం వద్ద ప్రారంభించారు. ఆయన నివాసంలో నిరుపయోగంగా ఉన్న వస్తువులను మున్సిపల్ సిబ్బందికి అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణం దెబ్బతినడంతో వాతావరణంలో పెనుమార్పులను ఎదుర్కోవలసి వస్తుందన్నారు. వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ మాట్లాడుతూ నగరంలో 67 ఆర్ఆర్ఆర్ కేంద్రాలను ఏర్పాటు చేసి ఈనెల 20 నుంచి జూన్ 5వ తేదీ వరకు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల వద్ద నిరుపయోగంలో ఉన్న వస్తువులను సేకరించనున్నట్లు ఆయన తెలిపారు. నిరుపయోగంగా వస్తువులు ఉంటే 8181960909 నెంబర్‌కు ఫోన్ చేస్తే ఇంటివద్దకే ఆర్ఆర్ఆర్ వాహనాన్ని పంపి ఆ వస్తువులను సేకరిస్తారన్నారు. వాహన ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రుహుల్లా, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటి మేయర్లు అవుతు శ్రీ శైలజారెడ్డి, బెల్లం దుర్గ, సబ్ కలెక్టర్ అదితి సింగ్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్ఆర్ఆర్ వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

నేటి నుంచి క్రికెట్ టోర్నమెంట్

వైద్యులు, వైద్య సిబ్బందికి మాత్రమే

భవానీపురం(విజయవాడపశ్చిమ): వైద్య సేవల్లో బిజీగా ఉండే వైద్యులు, వైద్య సిబ్బంది ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉండేందుకు మిత్ర మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి మిత్ర క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కేవీ సత్యనారాయణ తెలిపారు. నగరంలోని మిత్ర మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ కాన్ఫరెన్స్ హాల్‌లో క్రికెట్ టోర్నమెంట్‌కు సంబంధించిన టీ షర్ట్‌ను ఆయన శనివారం ఆవిష్కరించారు. డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గుంటుపల్లి వ్యాగన్ వర్క్‌షాప్ రైల్వే గ్రౌండ్‌లో ప్రతి ఆదివారం ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు. ఈ పోటీల్లో వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన వచ్చని తెలిపారు. మ్యాచ్‌కు మూడు రోజుల ముందు జట్టు సభ్యుల వివరాలు (హాస్పటల్ ఐడీ కార్డ్‌తో) కమిటీకి అందచేయాలన్నారు. సమావేశంలో డాక్టర్ అనూష గడ్డం పాల్గొన్నారు.



మిత్ర క్రికెట్ టోర్నమెంట్ టీ షర్ట్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ సత్యనారాయణ

నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. పాతబస్తీ 53వ డివిజన్ పరిధిలోని కాటుపల్లి వారి వీధిలో సుమారు రూ.20 లక్షలతో చేపట్టిన రోడ్డు నిర్మాణానికి వెలంపల్లి శ్రీనివాసరావు, స్థానిక కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావుతో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. వెలంపల్లి మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 53వ డివిజన్‌లో కోట్లాది రూపాయలతో అనేక అభివృద్ధి పనులు జరిగాయన్నారు. కాటుపల్లి వారి వీధిలో సుమారు రూ.20 లక్షల వ్యయ అంచనాతో రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి సంబంధించి ప్రత్యేక నిధుల ద్వారా ఈ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్, శ్రీశైలం దేవస్థానం సభ్యుడు గురుమహంతు మహేష్, నాయకులు పడాల చిన్నా, కొరగంజి భాను, అన్వర్, చాన్, పడాల రాజేష్, కొరగంజి దుర్గాంబ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

నేటి నుంచి యోగ, ధ్యాన, ప్రాణాయామం శిక్షణ

కంకిపాడు: ప్రొద్దుటూరు శివారు గాయత్రీ విహార్‌లో ఈనెల 21వ తేదీ నుంచి యోగ, ప్రాణాయామం, ధ్యానంపై ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గాయత్రీ విహార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వై.శ్రీనివాస్, కె.నాగప్రసాద్ తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం (గోసాల) శాఖ నేరెళ్ల తులసీ మాధవ్ ఆధ్వర్యంలో 28 రోజుల పాటు శిక్షణ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఎవరైనా శిక్షణ పొందొచ్చన్నారు.